కుటుంబ సమగ్ర సర్వేకు పకడ్బందీ ఏర్పాట్లు

ముదిగొండ: మాట్లాడుతున్న ఆర్డీవో నర్సింహారావు, బోనకల్లు: మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ విజయభాస్కర్‌రెడ్డి, వైరాటౌన్: మాట్లాడుతున్న అధికారులు

ముదిగొండ, నవంబర్ 2: కుల గణన, ఇంటింటి కుటుంబ సర్వే పక్కాగా నిర్వహించాలని ఖమ్మం ఆర్డీవో గరిడె నర్సింహారావు అన్నారు. ముదిగొండలోని రైతు వేదికలో శనివారం ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బందితో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికెళ్లి వ్యక్తిగత వివరాలతో పాటు ఇతర వివరాలు సమగ్రంగా సేకరించాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత ఎల్జెబిత్, ఎంపీడీవో శ్రీధర్ స్వామి, ఎంపీవో వాల్మీకి కిషోర్, ఎంఈవో రమణయ్య, ఆర్‌ఐలు ప్రసన్న కుమార్, వహీద తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లిలో..

కారేపల్లి, నవంబర్ 2: సమగ్ర ఇంటింటి సర్వేను సమగ్రవంతంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి నవీన్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న 150మంది ప్రభుత్వ ఉద్యోగులను సర్వే చేసేందుకు నియమించామన్నారు. ఒక్కొక్కరూ 150 కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీవో సురేందర్, ఎంఈవో జయరాజు పాల్గొన్నారు.

ఎన్యూమరేటర్లకు శిక్షణ

వైరాటౌన్, నవంబర్ 2: మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులోగల రైతువేదికలో శనివారం సమగ్ర ఇంటింటి సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, వైరా మున్సిపాల్ కమిషనర్ వేణు, ఎంపీడీవో సరస్వతి, ఎంపీవో జ్యోత్స్న, ఎంఈవో వెంకటేశ్వర్లు, ఏఎస్‌వో మీరాబీ శిక్షణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

బోనకల్లులో..

బోనకల్లు, నవంబర్ 2: సమగ్ర ఇంటింటి కుటుంబసర్వే పకడ్బందీగా నిర్వహించాలని మండల స్పెషలాఫీసర్, జిల్లా కార్మిక శాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక రైతు వేదికలో సమగ్ర ఇంటింటి సర్వేపై ఎన్యుమరేటర్లకు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఆయన మాట్లాడుతూ 22 గ్రామాల్లో ఈ సర్వే చేపట్టేందుకు ప్రతి ఎన్యుమరేటర్‌కు 175 ఇళ్లను కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు. 6వ తేదీ నుంచి ఈ సర్వే గ్రామాల్లో చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్ రమాదేవి, తహసీల్దార్ అనిశెట్టి పున్నంచందర్, ఎంఈవో దామాల పుల్లయ్య, ఎంపీవో వెంకటకోటేశ్వరశాస్త్రీ పాల్గొన్నారు.

ఎర్రుపాలెంలో..

ఎర్రుపాలెం, నవంబర్ 2: మండలంలోని మీనవోలు గ్రామంలో గల రైతువేదికలో ఈ నెల 6నుంచి ప్రారంభం కానున్న సమగ్ర ఇంటింటి సర్వేపై ఎన్యుమరేటర్లకు, సూపర్‌వైజర్లకు శనివారం శిక్షణ నిర్వహించారు. తహసీల్దార్ ఉషాశారద, ఎంపీడీవో సురేందర్ అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబసర్వేకు సంబంధించిన వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో రిసోర్సుపర్సన్లు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న డీఆర్‌డీవో సన్యాసయ్య

మామిళ్లగూడెం, నవంబర్ 2: మార్చి 2025 నాటికి నరేగా కింద మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ధనసరి అనసూయ అలియాస్ సీతక్క అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సచివాలయం నుంచి నరేగా పనులు, ఇందిరా మహిళాశక్తి, రోడ్డు నిర్మాణ పనులపై ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సులో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పనుల కింద మంజూరైన పనులు గ్రామాల్లో త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, ఇంకుడుగుంతల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు మంజూరు చేసిన నిధులు మార్చి 2025 వరకు ఖర్చు చేయాలని తెలిపారు. గ్రామాల్లో ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి ఉండేవిధంగా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో సన్యాసయ్య, అడిషనల్ డీఆర్‌డీవో శిరీష, అధికారులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య, నారాయణ సంస్థలపై చర్యలు తీసుకోవాలి

డీఈవోకి ఫిర్యాదు చేసిన ట్రస్మా

డీఈవోకి వినతిపత్రం ఇస్తున్న ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కాంతారావు, నాయకులు

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 2 : జిల్లాలో ఖమ్మం, సత్తుపల్లి తదితర చోట్ల నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలపై చర్య తీసుకోవాలని కోరుతూ తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్(ట్రస్మా) జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో డీఈవో సోమశేఖరశర్మను కలిసి ఫిర్యాదు చేశారు. రికగ్నైజేషన్ ఉన్న పేరుతో స్కూల్ బోర్డు, పబ్లిసిటీ, రిజల్ట్స్ ఉండాలని ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ఆర్‌టీవో వెంకటరమణను కలిసి బస్సుల నిర్వహణపై చర్యలు తీసుకోవాలని కోరారు. తొలుత నగరంలోని న్యూవిజన్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాంతారావు, కార్యదర్శి నాయుడు వెంకటేశ్వరరావు, కోశాధికారి నాసరయ్య, రాష్ట్ర కన్వీనర్ ఐవీ రమణరావు, కేసా వీరన్న, శశిధర్‌రెడ్డి, అజారుద్దీన్, ఎర్షాద్, ఇస్మాయిల్, పీ అశోక్‌రెడ్డి, సౌభాగ్య, మతీన్, సూరిబాబు, బోడేపూడి కిరణ్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా క్రీడా జట్ల ఎంపికలు

ఖమ్మం సిటీ, నవంబర్ 2 : ఉమ్మడి ఖమ్మం జిల్లా పాఠశాలల అండర్-14 బాల, బాలికల హ్యాండ్‌బాల్, అండర్- 14, 17 కేటగిరి యోగా, స్కేటింగ్ జట్లను ఎంపిక చేశారు. శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి ఈ.సోమశేఖరశర్మ పర్యవేక్షణలో నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో పోటీలు నిర్వహించారు. వీటికి ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి 180మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను కామారెడ్డిలో జరుగనున్న హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు జిల్లా పాఠశాలల క్రీడా కార్యదర్శి కే నరసింహమూర్తి తెలిపారు. కార్యక్రమంలో పీడీ డీ శ్రీనివాస్, స్కేటింగ్ కోచ్ సురేశ్, హ్యాండ్‌బాల్ కోచ్ పీడీ కృష్ణయ్య, జీ సైదేశ్వరరావు, ఏ కృష్ణ, శివ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా కళావతిబాయి

డీఎంహెచ్‌వో బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ కళావతిబాయి

ఖమ్మం సిటీ, నవంబర్ 2 : జిల్లా వైద్యారోగ్యశాఖ ఇన్‌చార్జి అధికారిగా డాక్టర్ కళావతిబాయి శనివారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో గత అధికారి డాక్టర్ వరికూటి సుబ్బారావు నుంచి చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసి వైద్యారోగ్యశాఖ ప్రతిష్ఠను ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు, పీవోలు డాక్టర్ చందూనాయక్, డాక్టర్ వెంకటరమణ, ఏవో డాక్టర్ మోత్యా, డెమో సాంబశివారెడ్డి, ఎస్‌వో నవీన్, ఎన్‌హెచ్‌ఎం డీపీవో దుర్గ పాల్గొన్నారు.

నేడు మండలంలో మంత్రుల పర్యటన

ఖమ్మం రూరల్, నవంబర్ 2: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం మండలంలో పర్యటిస్తారని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.45 గంటలకు కొండాపురం, 12.15గంటలకు రెడ్డిపల్లి గ్రామాలో పొంగులేటి, మధ్యాహ్నం 3-00 గంటలకు తుమ్మల, పొంగులేటిలు గురుదక్షిణ ఫౌండేషన్‌లో జరిగే విగ్రహావిష్కరణ, వివిధ భవనాల ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'ప్రజాసేవలే గుర్తుండిపోతాయి'

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 2: ప్రభుత్వ ఉద్యోగంలో పనిచేసే ప్రతి ఒక్కరూ ఉద్యోగ విరమణ పొందవలసిందేనని, విధి నిర్వహణలో ప్రజలకు చేసిన సేవలే చిరకాలం గుర్తుండిపోతాయని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ అన్నారు. శనివారం ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో రేపాల నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ సభలో పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో రెజొనెన్స్ శ్రీధర్, కట్టా శేఖర్, జి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ కార్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

పెనుబల్లి, నవంబర్ 2: మండల పర్యటనలో భాగంగా వీఎం బంజరలో ఆర్‌అండ్‌బీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే మట్టా రాగమయి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల పనితీరుపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఉద్యోగులందరూ అందుబాటులో ఉండాలని, మళ్లీ ఇలా జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. ఆమె వెంట ఏఎంసీ చైర్మన్ నీరజ, నాయకులు బుర్ర కోటేశ్వరరావు, బీ కృష్ణవేణి, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఏఈవో' కృషి ప్రశంసనీయం

రఘునాథపాలెం, నవంబర్ 2: భూమి ఉన్నది.. ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలూ వర్తిస్తాయి అనుకున్నారు ఆ రైతులు. కానీ రైతుబీమాకు అర్హులుగా లేమని మాత్రం గుర్తించలేకపోయారు. గత ప్రభుత్వం 2016 నుంచి కల్పించిన రైతుబీమాకు అవకాశం కల్పించినా నిరక్షరాస్యులు కావడంతో అందుకు దరఖాస్తు చేసుకోలేకపోయారు. ఈ విషయాన్ని గుర్తించిన కోయచలక క్లస్టర్ ఏఈవో కార్తీక్ కోయచలక గ్రామంలో అర్హులుగా ఉండి జాబితాలో పేర్లు లేనివారిని గుర్తించారు. ఈవిషయాన్ని సంబంధి త క్లస్టర్ పరిధిలోని రైతుల వాట్సాప్ గ్రూప్‌లో పెట్టాడు. ఆది కాస్త సదరు రైతుల దృష్టికి చేరడంతో దరఖాస్తు చేసుకున్నారు. రైతుబీమాకు దరఖాస్తు చేసుకున్న వారిలో చెరుకూరి రంగయ్య ఇటీవల మృతిచెందాడు. ఏఈవో కృషి ఫలితంగా రంగయ్య కుటుంబం రైతుబీమా ప్రయోజనాన్ని పొందింది.

టోల్‌ఫ్రీ సేవలు మరింత విస్తృతం

మామిళ్లగూడెం, నవంబర్ 2 : జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు టోల్ ఫ్రీ సేవలు మరింత విస్తృతం చేసినట్లు టీజీఎన్‌పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్ ఎస్ఈ సురేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు 24 గంటలపాటు అందుబాటులో ఉండేందుకు సాంకేతికతను జోడించి సత్వర ఫిర్యాదుల పరిష్కారానికి 1912ను సంప్రదించాలని సూచించారు. ఫోన్ చేసి ఫిర్యాదు చేసిన వెంటనే సంబంధిత ప్రాంత అధికారికి సమాచారం చేరుతుందని వెంటనే ఆయా ప్రాంత అధికారులు స్పందించి పరిష్కరిస్తారని తెలిపారు.

గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే

కొణిజర్ల, నవంబర్ 2: స్థానిక తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరం డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు స్వాగతం పలుకుతూ శనివారం ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థినులు స్వాగతపు వేడుకలు నిర్వహించారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఖమ్మం రీజియన్ కోఆర్డినేటర్ నాగార్జునరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీ శ్రీవాణీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పాఠశాలల యోగా ఎంపికలు

కొణిజర్ల, నవంబర్ 2: మండలంలోని తనికెళ్ల జడ్పీహెచ్ఎస్‌లో అండర్-14, అండర్-17 బాల బాలికల యోగా ఎంపికలు శనివారం నిర్వహించారు. వీటిలో బాలికలు 50 మంది, బాలురు 42 మంది పాల్గొన్నారు. ప్రతి గ్రూపులో ఐదుగురు చొప్పున ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయి పోటీలు వరంగల్‌లో ఈ నెల 5, 6, 7తేదీల్లో జరుగుతాయన్నారు.

మాజీ మంత్రి పువ్వాడ విస్తృత పర్యటన

పలు కుటుంబాలకు పరామర్శ

కార్పొరేటర్ జగన్‌కు నివాళి అర్పిస్తున్న పువ్వాడ

రఘునాథపాలెం, నవంబర్ 2: మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ రఘునాథపాలెం మండల పరిధిలో శనివారం విస్తృతంగా పర్యటించారు. చిమ్మపూడి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కాంపాటి రవి తండ్రి రాములు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న పువ్వాడ ఆ గ్రామానికి వెళ్లి రాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన 3వ డివిజన్ కార్పొరేటర్ మలీదు జగన్‌మోహన్‌రావు ఇంటికెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. జీకే బంజర గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు భూక్యా లక్ష్మణ్ భార్య మంగ మృతి పట్ల నివాళి అర్పించారు. పువ్వాడ ఉదయ్‌నగర్ కాలనీలో అనారోగ్యంతో మృతిచెందిన బత్తుల సావిత్రి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. శివాయిగూడెంలో మృతిచెందిన గార్లపాటి కళ్యాణ్, గార్లపాటి విజయ్‌కుమార్ కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ గుత్తా రవి, బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు దొంతు సత్యనారాయణ, పిన్ని కోటేశ్వరరావు, మెంటం రామారావు, కొంటెముక్కల వెంకటేశ్వర్లు, తాతా వెంకటేశ్వర్లు, చిలుమూరు కోటి, హెచ్ ప్రసాద్, గుండ్ల ముత్తయ్య, చెన్నబోయిన సైదులు, భద్రయ్య, శ్రీను, రాములు ఉన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ

ఎమ్మెల్యేను సత్కరిస్తున్న హీరో సుమన్, తదితరులు

పెనుబల్లి, నవంబర్ 2: మండలంలోని వీఎం బంజర గ్రామంలో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహన్ని ఎమ్మెల్యే మట్టా రాగమయి, సినీహీరో సుమన్ శనివారం ఆవిష్కరించారు. అనంతరం సుమన్ మాట్లాడుతూ నాడు ప్రజారక్షణకు ప్రాణాలను పణంగా పెట్టి పోరాడినయోధుడు సర్వాయి పాపన్న అని అన్నారు. కార్యక్రమంలో కల్లూరు, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్లు భాగం నీరజచౌదరి, దోమ ఆనంద్, సత్తుపల్లి మున్సిపల్ వైస్‌చైర్మన్ తోట సుజలరాణి, రాష్ట్ర, జిల్లా, పెనుబల్లి గౌడ సంఘం అధ్యక్షులు, గౌడసంఘం కమిటీ సభ్యులు, విగ్రహ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలి

పెనుబల్లి, నవంబర్ 2: అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా)మండల కమిటీ ఆధ్వర్యంలో లంకపల్లి సుందరయ్యకాలనీలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఐద్వా మండల కార్యదర్శి మిట్టపల్లి నాగమణి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో మహిళలపై హింస, హత్యాచారాలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు. కార్యక్రమంలో గొల్లమందల సరసమ్మ, దుగ్గిరాల నాగమణి, యామవరపు సక్కుబాయి, కృష్ణవేణి, పోతిని నాగమణి, నాగేంద్ర, అలివేలు, వెంకటనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

జమలాపురం అర్బన్‌పార్క్ కోసం స్థల పరిశీలన

ఎర్రుపాలెం, నవంబర్ 2: మండలంలోని జమలాపురం గ్రామంలో టూరిజం డెవలప్‌మెంట్, అర్బన్‌పార్క్ కోసం అటవీ భూములను డీఎఫ్‌వో సిద్ధార్థ్‌విక్రమ్‌సింగ్ శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో రెవెన్యూ భూములు కూడా అటవీభూములలో కలిసి ఉన్నాయని సర్వే నిర్వహించి అటవీభూములకు సరిహద్దు నిర్ణయిస్తామన్నారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు అటవీశాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.5 కోట్లతో జమలాపురం గ్రామంలో పర్యాటక ప్రాంతం అభివృద్ధికి రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. జమలాపురం గ్రామ సరిహద్దులు, ప్రజల నాగరికత, పర్యాటక అభివృద్ధి ఆవశ్యకత, ఆలయ చరిత్ర తదితర అంశాలను ఎర్రుపాలెం సొసైటీ మూల్పూరి శ్రీనివాసరావు ఆయనకు వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో మంజుల, ఎఫ్ఆర్‌వో బీ శ్రీనివాసరెడ్డి, భీమవరం సెక్షన్ యు సురేశ్, బుచ్చిరెడ్డిపాలెం బీట్ బీ నాగేశ్వరరావు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

సత్తుపల్లిటౌన్, నవంబర్ 2: ఆషా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 8న ప్రారంభమయ్యే ఆషా మెమోరియల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్లను శనివారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ వైస్‌చైర్మన్ తోల సుజలరాణి, కల్లూరు మార్కెట్ కమిటీ చైర్మన్ నీరజచౌదరి, కౌన్సిలర్లు, నిర్వాహకులు పాల్గొన్నారు.

గురుకులాల్లో డైట్ చార్జీలు పెంచడం పట్ల హర్షం

కొణిజర్ల, నవంబర్ 2: తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాలల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, ప్రిన్సిపల్ సెక్రటరీ ఏ శరత్ గురుకుల విద్యార్థుల సంక్షేమ గురుకులాలకు డైట్ ఛార్జీలు పెంచడం పట్ల కొణిజర్ల తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో ప్రిన్సిపాల్ డాక్టర్ డీ శ్రీవాణీ, వైస్‌ప్రిన్సిపాల్ జీ శంకరజ్యోతి, అధ్యాపకులు, విద్యార్థినులు ఉన్నారు.

గంగులకు నివాళి అర్పించిన ఎంపీ

నివాళి అర్పిస్తున్న ఎంపీ వద్దిరాజు

ఖమ్మం, నవంబర్ 2: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తన సోదరులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పలువురు ప్రముఖులతో కలిసి గంగుల లక్ష్మీనర్సమ్మకు ఘనంగా నివాళులర్పించారు. ఎంపీ రవిచంద్ర సమీప బంధువు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాతృమూర్తి లక్ష్మీనర్సమ్మ గత నెల 22వ తేదీన మృతిచెందింది. శనివారం కరీంనగర్ కేఎస్ఎల్ కన్వెన్షన్ హాలులో లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పూలుజల్లి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె కుమారులు సుధాకర్, వెంకన్న, కమలాకర్, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులకు నియామక పత్రాలు

నియామకపత్రం అందజేస్తున్న డీఈవో, జడ్పీ డిప్యూటీ సీఈవో

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 2: డీఎస్సీ-2024లో స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులకు నగరంలోని డైట్ కళాశాలలో శనివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎస్‌జీటీలో 26 మంది, స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో ఏడుగురికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి, డీఈవో సోమశేఖర శర్మ, సూపరింటెండెంట్ చావా శ్రీనివాసరావు, సీఎంవో రాజశేఖర్, ఏఎన్‌వో వజ్జా కిశోర్, ఎంఈవో బి.రాములు, శ్రీనివాస్, రమేశ్, కార్యాలయ సిబ్బంది ఎర్రమళ్ల శ్రీనివాసరావు, కేవీ రామారావు, జిలానీ, రాంబాబు, భాస్కర్, యూసఫ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

పీజీ కళాశాలను సందర్శించిన రిజిస్ట్రార్..

కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి శనివారం సందర్శించారు. అధ్యాపకులతో సమావేశమై అభివృద్ధి, సమస్యల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వై.వెంకయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

చేపపిల్లలు పంపిణీ

వేంసూరు, నవంబర్ 2: మండలంలోని 59 చెరువులకు ప్రభుత్వం అందించిన ఉచిత చేపపిల్లలను వైరా మత్స్యశాఖ ఆధ్వర్యంలో సొసైటీ సభ్యులకు మత్స్యశాఖ ఏడీ శివప్రసాద్ శనివారం పంపిణీ చేసి మాట్లాడారు. మండలంలో 59 చెరువులకు గాను 7 లక్షల చేపపిల్లలను దశలవారీగా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

మిర్చికి కాండం కుళ్లు నివారణ చర్యలు చేపట్టాలి

కూసుమంచి, నవంబర్ 2: మండలంలోని పలు గ్రామాల్లో మిర్చికి కాండం కుళ్లు సోకి నష్టం కలుగుతుందని వాటి నివారణ చర్యలు చేపట్టకపోతే తీవ్ర నష్టం కలిగే ప్రమాదముందని మండల వ్యవసాయశాఖ అధికారి రామడుగు వాణి రైతుకు సూచించారు. మండలంలోని గట్టుసింగారం క్లస్టర్ పరిధి కోక్యతండా, గట్టుసింగారం గ్రామాల్లో మిర్చి తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో వంశీ, రైతులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో స్పెషల్‌డ్రైవ్

మధిర, నవంబర్ 2:: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మైనర్ డ్రైవింగ్, ర్యాష్‌డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్‌పై శనివారం ఎస్సై సంధ్య ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్సై సంధ్య మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇచ్చినట్లయితే ఎంవీయాక్ట్ కింద తల్లిదండ్రులపై, వాహన యాజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సీపీఎం మండల కార్యదర్శిగా సురేశ్

బోనకల్లు, నవంబర్ 2: సీపీఎం మండల కార్యదర్శిగా మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన కిలారు సురేశ్ శనివారం ఎన్నుకున్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 2: మండల కేంద్రంలో ఓ వెల్డింగ్ షాపులో వర్కర్‌గా పని చేస్తున్న యువకుడు అనుమాస్పందంగా మృతిచెందిన ఘటన శనివారం వెలుగుచూసింది. రూరల్ పోలీసులు, మృతుడు తల్లి తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం సోమలగూడెం గ్రామానికి చెందిన కామిశెట్టి జగదీష్ (30) కొంతకాలంగా పెద్దతండా పంచాయతీ సాయిప్రభాత్‌నగర్‌లో నివాసం ఉంటూ సాయిరాం వెల్డింగ్ షాపులో వర్కర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల1వ తేదీన ఇదే గ్రామానికి చెందిన హరి నూతన భవనంలో షట్టర్ ఫిట్టింగ్ నిమిత్తం వెళ్లాడు. సాయంత్రం 5గంటలకు వర్క్‌షాపు యజమాని బ్రహ్మచారి, మరో వర్కర్ రాజేశ్, జగదీష్ భార్య జ్యోతిలు జగదీశ్ తమ్ముడు అక్షయ్‌కు ఫోన్ చేసి జగదీశ్‌కు గుండెపోటు వచ్చిందని చెప్పారు. ఖమ్మం నగరంలోని సాయిమారుతీ వైద్యశాలకు తీసుకవెళ్లగా అక్కడి వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకవెళ్లమని సూచించారని, తీసుకెళ్లే లోపు మృతిచెందాడని చెప్పారు. జగదీశ్ కుటుంబ సభ్యులు ఖమ్మం వచ్చి ప్రభుత్వ ఆసుపత్రిలో జగదీశ్ మృతదేహాన్ని చూశారు. మృతుడు తల్లి ఈశ్వరమ్మ నా కొడుకు మరణంపై అనమానం ఉందని, వర్క్‌షాపు యజమాని బ్రహ్మచారిపై అనుమానాలు ఉందని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పురుగు మందు తాగి కౌలురైతు మృతి

వేంసూరు, నవంబర్ 2: పురుగుమందు తాగి కౌలురైతు మృతిచెందిన ఘటన మండలంలోని చౌడవరం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కౌలురైతు నల్లిబోయిన గురునాథం (38) వ్యవసాయ పెట్టుబడులకు, ఇల్లు కట్టుకునేందుకు అప్పులు చేసి ఆర్థిక సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది శుక్రవారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ షేక్ కరీముద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ వ్యాన్ ఢీకొని వృద్ధుడు మృతి

వేంసూరు, నవంబర్ 2: స్థానిక ఉషోదయ పబ్లిక్ స్కూల్‌కు చెందిన వ్యాన్ ఢీకొని వృద్ధుడు మృతిచెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. మండలంలోని లచ్చన్నగూడెం గ్రామానికి చెందిన గుంజాల రాఘవులు (80) రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా స్కూల్ వ్యాన్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వేంసూరు ఎస్సై వీరప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్ ఢీకొట్టి మహిళ మృతి

రఘునాథపాలెం, నవంబర్ 2 : డీసీఎం వ్యాన్ వేగంగా వచ్చి ఢీకొట్టిన ఘటనలో ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన శనివారం ఖమ్మం అర్బన్ పరిధి వైఎస్ఆర్‌నగర్‌లో చోటుచేసుకుంది. వైఎస్ఆర్‌నగర్‌కు చెందిన చింతల సుజాత(39) చికెన్ తెచ్చేందుకు తన హోండా యాక్టివాపై స్థానిక షాపు వద్దకి వెళ్లింది. షాపు వద్ద బండిని ఆపే క్రమంలో వెనకాల నుంచి వచ్చిన డీసీఎం వ్యాన్ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుజాత అక్కడికక్కడే మృతి చెందింది. భర్త రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

టీజీపీఏ జిల్లా కోశాధికారిగా దర్శకిరణ్

మధిర రూరల్, నవంబ ర్ 2: తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారిగా మధిర మండలం వంగవీడు గ్రామానికి చెందిన దర్శి కిరణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం మధిరలో జరిగిన ఖమ్మం జిల్లా కమిటీ విస్తృతస్థాయి సమావేశంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కోట లోకేశ్, జిల్లా అధ్యక్షులు గొల్లమండల శ్రీనివాసరావు కిరణ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED
★Supervisors, Sales Exicutives, Team Leaders, Dealers for a Car & Bike Polish Company. Free Room & Cooking facility. Ph: 8019399008.
NT-339365-All

PLOT FOR SALE
★గజం: 2,500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజీ, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 7569587521.
NT-338783

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

CHANGE OF NAME
★I, MOHAMMAD YOUSUF (OLD NAME) R/O. H NO 4-3-170, GAJULARAJAM BASTHI, KOTHAGUDEM, BHADRADRI KOTHAGUDEM DIST, TELANGANA, Changed my Name as MOHAMMAD YOUSAF (NEW NAME) S/O. MOHAMMAD MAQBOOL.
KMM

INDUSIND BANK LTD.
COMMERCIAL VEHICLE FOR SALE
1). BAJAJ RE CNG 4S FI BS VI, MODEL:2024, TG04T1603, 2).APE AUTO DX CLS BS VI, MODEL:2024, TG04T0654, 3). BAJAJ RE CNG 4S FI BS VI, MODEL:2022, TS04UD9749 4). BAJAJ RE CNG 4S FI BS VI, MODEL:2023, TS04UEE4778, 5). MARUTI SUPER CARRY DIESEL BS IV, MODEL:2019, TS04UD1105.
Cell: 9959401146
Polas Juice Point Lane, ZP Centre Beside Sidhardha Hospitals,Khammam.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616